తేలని 'సిండికేట్' లెక్కలు...

అధికార పార్టీ నేతల్లో లుకలుకలు
పెట్టుబడులైనా వెనక్కు వస్తాయో.. లేదోనని గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారపార్టీలో మద్యం సిండికేట్ లెక్కలు తేలడం లేదట. దీంతో భాగ స్వామ్యుల మధ్య లుకలుకలు మొద లయ్యాయి. ఎప్పటికి ఈ లెక్కలు తేలుస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఎని మిది నెలలుగా భాగ స్వామ్యులకు మద్యంవ్యాపా రం లోని లెక్కలు తేల్చకపోవడంతో ఏమి జరుగుతున్నదోనన్న గుబులు కొందరిలో నెలకొన్నట్టు సమాచారం. దీంతో ఆ పార్టీ నేతల మధ్య అంతర్గత తగాదాలకు దారితీస్తున్నట్టు చర్చ నడుస్తోంది.

లాటరీ తరువాత సిండికేట్

రాష్ట్రంలో 2024లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానంలో మార్పులు తీసుకొచ్చింది. అంతక మునుపు ప్రభుత్వం ద్వారానే మద్యం వ్యాపారం నడిచేది. ఈ విధానం కాదని గతేడాది అక్టోబరు మాసంలో కొత్త విధానాన్ని ప్రకటించింది. ప్రయివేటు వ్యక్తుల ద్వారానే లాటరీ పద్ధతిలో మద్యం అమ్మకానికి లైసెన్సులను జారీ చేసింది. ఇందులో పెద్దఎత్తునే వ్యాపారులు లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆ సమయంలోనే సిండికేట్ ద్వారా దరఖాస్తులు వేసుకోవాలని ప్రయత్నించినా కొంత పోటీ అయితే కొనసాగింది. లాటరీ అనంతరం లైసెన్సులు వచ్చాక సిండికేట్ జరిగింది. అధికారపార్టీ ముఖ్య నేతలకు సంబంధించిన దుకాణాల లైసెన్సులు వచ్చిన చోట పట్టించుకోనప్పటికీ కొత్తవారికి ఇతరులకు వచ్చిన చోట మాత్రం తమకు భాగస్వామ్యం ఇవ్వాలనిగాని, తమ వారికి భాగస్వామ్యం ఇవ్వాలన్న పేరుతో చాలా దుకాణాలను తమ పరిధిలోకి తీసుకున్నారు. ఒక్కో వ్యక్తి నుంచి పది లక్షల రూపాయల నుంచి రూ.25 లక్షలు ఇలా అనేక స్థాయిలో వాటాలిచ్చి భాగస్వామ్యులుగా చేసుకున్నారు.

ఎనిమిది నెలలుగా తేలని లెక్కలు

భాగస్వామ్యం కలుపుకుని దుకాణాలు నడిపేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. అయితే భాగస్వామ్యులకు ఏ నెలకు ఆ నెల వ్యాపార లాభనష్టాల లెక్కలు మాత్రం చూపడం లేదట. దీంతో భాగస్వామ్యులుగానున్న అధికారపార్టీ నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. లెక్కలు చూపండని అడిగితే ఏదో కారణంతో చూపకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ విభేదాల్లో భాగమే అనంతపురం నగరంలో అధికార పార్టీ నేతల మధ్య ఇటీవల పెద్ద వివాదం చోటు చేసుకున్నట్లు టిడిపిలో చర్చ నడుస్తోంది. రూ.90 లక్షల వరకు ఒక నాయకుడు పెట్టుబడి పెడితే ఇప్పటి వరకు లెక్కలు చూపకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇది పెద్ద చర్చ కావడంతో పార్టీ అధిష్టానం వరకు సమస్య వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే ఈ సిండికేట్ వ్యవహారం ఇంకా ఎంత వరకు పోతుందన్నది చూడాల్సి ఉంది.

పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

వేతనాలు చెల్లించేవరకు సమ్మెఆగదు

-'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే కారణం
-నిరసనలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించేదాకా సమ్మె ఆగదని, ఈ సమ్మెకు ప్రభుత్వమే కారణమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు అన్నారు.కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి పంప్‌హౌస్ వద్ద ఆదివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కోశాదికారి గోపాల్, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు రాము, నరేష్‌లతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే అనేక దఫాలు జిల్లా కలెక్టర్ చర్చలకు పిలిచినప్పటికి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాయదుర్గం ఎమ్మెల్యే విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లాకలెక్టర్ వినోద్‌కుమార్‌తో జరిగిన చర్చల్లో సుమారు రూ.5.50కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని ముగ్గురం రాష్ట్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషిచేస్తామని హామీ ఇచ్చారనిచెప్పారు. 77 రోజులుగా సమ్మె చేస్తున్నా పాలకులు, అధికారులు పరిష్కరించక పోవడం దురదృష్టకరమన్నారు. ఫేస్-1 కింద పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలల వేతనం, 12 నెలల పిఎఫ్, ఫేస్-4 కింద పనిచేసే కార్మికులకు 2023 నుంచి 2024 జనవరి వేతనం, 22నెలల పిఎఫ్ ఇవ్వాల్సుందన్నారు. పస్తులుండి కార్మికులు తాగునీటి పథకాన్ని నడిపారని ప్రభుత్వం వెంటనే వేతనాలు, పిఎఫ్ చెల్లించి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిని పరిష్కరించేవరకు కార్మికుల సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు పై రాళ్లను ఏరుతున్న గ్రామస్తులు

కంకర తేలిన ముగెత్తంపల్లి రోడ్డు

వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని ముగెత్తంపల్లికి వెల్లే రోడ్డు మొత్తం కంకర తేలి అధ్వాన్నంగా మారడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరలో గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. దీంతో ఈ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. గూగూడుకు వచ్చే భక్తులు ఎక్కువగా ముగేతంపల్లి రోడ్డు మీదే ప్రయాణిస్తూ ఉంటారు. ఈనేపథ్యంలో కంకర తేలిన రోడ్డుపై వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే రాళ్లు తగిలి వాహనదారులు కింద పడిన ఘటనలు ఉన్నాయి. దీనికితోడు వాహనాలు వెళ్లేటప్పుడు అటుగా వెళ్తున్న పాదచారులపైకి రాళ్లు దూసుకొచ్చి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు వేయాలని ముగెతంపల్లికి చెందిన వినోదం లోకేష్, నరసింహయాదవ్, వినోదం శివయ్య, నారాయణస్వామి, కుళాయప్ప, గ్రామస్తులు కోరుతున్నారు.

అమ్మో మట్టి ట్రాక్టర్లా..!

వేగంగా వెళ్తున్న వాహనాలు-భయాందోళనలో ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి-యల్లనూరు

అధిక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

మండలంలో మట్టి తరలించే ట్రాక్టర్లను చూస్తుంటే వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా మట్టి అక్రమ రవాణా భారీగానే సాగుతోంది. అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను డ్రైవర్లు అతివేగంగా నడుపుతున్నారు. మట్టి ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుంటే పక్కన వెళ్తున్న వాహనాలకు ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందో అని భయాందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఎక్కువ శబ్ధంతో డిజె పాటలు పెట్టుకుని వెనుక నుంచి వచ్చే వాహనాలకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఎవరైనా సమయానికి వెళ్లాలంటే వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. అతివేగంగా వెళ్తుండటంతో పక్కన ఉన్న రాళ్లు ఎగిరి పడుతుండటంతో గాయాలపాలవుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే జెసిబిలతో ట్రాక్టర్లకు మట్టి వేస్తుండటంతో ఎక్కువగా మట్టి వస్తోంది. దీంతో రోడ్డుపై మట్టి పడుతూ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

తరిగిపోతున్న 'తుమ్మ' సంపద

ఇష్టమొచ్చినట్లు నరుకుతున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

చెరువులో నరికిన తుమ్మచెట్లు

'పర్యావరణాన్ని రక్షించుకోండి.. మానవ మనుగడను పెంచుకోండి' అని ప్రభుత్వం నిత్యం ప్రచారం చేస్తోందే తప్ప ఆచరణలో పెట్టడంలో అలసత్వం శూన్యమనే విమర్శలు వినిస్తున్నాయి. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రూ.కోట్లు ఖర్చు చేసి చెట్లు నాటుతున్నారే తప్ప పరిరక్షించే చర్యలు తీసుకోలేకపోతుండటం బాధాకరం. ఎంతో అక్రమార్కులు చేతివాటం ప్రదర్శిస్తూ విచ్చలవిడిగా చెరువుల్లోని తుమ్మచెట్లను నరికి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా పుట్లూరులోని ఎల్లోజి పంతులు చెరువులో ఉన్న తుమ్మ చెట్లను ఇష్టమొచ్చినట్లు నరికివేయడమే ఇందుకు నిదర్శనం. మండలంలోని వాగులు, వంకల్లో ఉన్న వృక్ష సంపదను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా నరికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా మారకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పుట్లూరు చెరువులోని తుమ్మచెట్లను నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

నాణ్యమైన విత్తనోత్పత్తే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

వేరుశనగ బస్తాలను పంపిణీ చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

నాణ్యమైన విత్తనోత్పత్తిని సేకరించి రైతులకు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని మూలగిరిపల్లి గ్రామంలో జాతీయ నూనె గింజల విత్తనోత్పత్తి కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని 100 మంది రైతులకు వేరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంలో రైతులు బాగు చేసిన పంటను పండించిన పంటను రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించాలని అగ్రిమెంట్ చేసినట్లు తెలిపారు. మార్కెట్ రేటు కంటే రూ.200 ఎక్కువ ధరతోనే విక్రయించవచ్చని సూచించారు. అదేవిధంగా వజ్రకరూరు మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో 50 మంది రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. జాతీయ నూనె గింజల విత్తనోత్పత్తి పథకం కింద రైతులు విత్తనం వేసిన రోజు నుంచి పంట కోసం వ్యవసాయ శాఖ అధికారులు వారానికి ఒకసారి పొలాలకు వెళ్లి రైతులతో మమేకమై సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలతోపాటు వాడాల్సిన మందుల గురించి వివరిస్తారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, రాయలసీమ ఉత్పత్తిదారుల సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సిఇఒ నగేష్, సంఘం సభ్యులు, టిడిపి మండల అధ్యక్షులు విజయభాస్కర్, ఉపాధ్యక్షులు గోవిందు, లాయర్ సీనప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రచ్చకట్టపై సర్వే చేస్తున్న సిపిఎం నాయకులు

మండల పరిధిలోని తిమ్మాపురం, దోనిముక్కల, నల్లగొండ, కసాపురం, దోసలుడికి, బుగ్గసంగాల గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయయేతర శ్రామికుల సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా సిపిఎం బృందం శ్రామికులను కలిసి సమస్యలు, కష్టాలను అడిగి తెలుసుకుంది. ప్రధానంగా భూమిలేని పేదలు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలుగా... ఆటో హమాలీలు భవనిర్మాణ కార్మికులుగా.. చేతివృత్తుదారులుగా.. గ్రామీణ ఉపాధి హామీ కూలీలుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి హమాలీలుగా పని చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం భూమి వర్షాధారం మీదే ఆధారపడి ఉండటంతో అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్ర, ఎస్‌కెఎం బాషా, వీరన్న, ఖాదర్‌బాషా, శ్రామికులు పాల్గొన్నారు.

మహిళలపై పెరిగిన దాడులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి-మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వ పరిపాలనలో బాలికలు, మహిళలు అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోయాలని మాజీ మంత్రి, వైసిపి శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల బాలికలు, మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యలపై నిరసిస్తూ పౌర సమాజం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై జరిగిన అఘాయిత్యం సభ్య సమాజం తల దించుకునేలా ఉందన్నారు. నెలలు తరబడి గ్రామంలో బాలికలపై దుర్మార్గులు అత్యాచారం చేస్తుంటే గ్రామ సమాజం పట్టనట్లు వ్యవహరించడం విచారకరం అన్నారు. గతంలో కూడా అదే గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరిగాయంటూ ఎస్పీ చెప్పడం చూస్తుంటే ఆ గ్రామంలో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు అన్నారు. దళిత, గిరిజన బాలికలు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. రాజ్యాంగం బద్ధంగా అత్యాచార సంఘటనలో ప్రభుత్వం నుంచి అందించాల్సిన సౌకర్యం బాలిక కుటుంబానికి అందించాలన్నారు. పౌర సమాజం నాయకులు రామాంజినేయులు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సమాజం నాయకులు రామాంజినేయులు, కాంగ్రెస్ పార్టీ దాదాగాంధీ, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు లింగమయ్య, వైసిపి నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, శేషానందరెడ్డి, జివిఎస్‌ఎస్ వ్యవస్థాపకులు శివ శంకర్ నాయక్, పిడిఎస్‌యు నాయకులు శంకర్, వెంకట్, ప్రజా సంఘం నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చే అదనపు నిధులతో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోండి

జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇచ్చే అదనపు నిధుల సాయంతో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ సూచించారు. జిల్లాలో పలు లేఅవుట్లలో ఏడాది అయినా గృహ నిర్మాణాలు పూర్తి కావడం లేదు. గత వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టణాల్లో అయితే ఒక సెంటు, గ్రామాల్లో అయితే ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించింది. స్థల కేటాయింపులు కూడా పలుచోట్ల అనువుగాని చోట కొండ గుట్టల్లో మంజూరు చేయడంతో అక్కడ ప్రధానంగా నీరు, రహదారి తదితర సమస్యలతో పలువురు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో పలుచోట్ల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్లు స్థలం కేటాయిస్తామని ప్రకటించింది. ఇప్పటికీ నిర్మాణాలు కానీ చోట చెప్పిన ప్రకారం స్థలం కేటాయిస్తామని చెప్పడంతో పాటు గత వైసిపి ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షలు కేటాయించగా ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అదనపు నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో గృహ నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో కొనసాగుతున్న గృహ నిర్మాణాలపై జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ పలు అంశాలను ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని లేఅవుట్లలో ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి ?

జవాబు : జిల్లాలో పిఎంజివై అర్బన్, పిఎంఎవై గ్రామీణ ప్రాంతాలను కలిపి 297 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 72,338 గృహాలు మంజూరు అయ్యాయి. ఇందులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 30,987 గృహాలు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో 36,257 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 27వేల గృహనిర్మాణాలు పూర్తి కాగా వివిధ దశలలో 32,608 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రభుత్వం రూ.671 కోట్లు మంజూరు చేయగా మెటీరియల్ తో పాటు ఇతర బిల్లులు లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగింది.

ప్ర :-కూటమి ప్రభుత్వం అదనంగా మంజూరు చేసే నిధులు వివరాలు తెలపండి?

జ : ప్రభుత్వం కేటాయించే రూ. 1.80 లక్షల నిధులతో పెరిగిన ధరలు మేరకు గృహ నిర్మాణాలను బడుగు బలహీన వర్గాల వారు పూర్తి చేసుకోలేరని భావించిన కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీకయితే రూ.75 వేలు మంజూరు చేస్తోంది. ఈ నిధులు ఎస్సీ, బిసి, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా సహాయం అందించడం జరుగుతుంది. ఈ అదనపు నిధులు లబ్ధిదారులు తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు. లబ్ధిదారులు స్వయం సహాయక మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆ సంఘాల ద్వారా కూడా అప్పు పొందవచ్చు.

ప్ర: జిల్లాలో ఎప్పటిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యం ఉందా?

జ : జిల్లాలో మంజూరు అయిన ఇళ్ల నిర్మాణాల్లో ఈ నెలాఖరులోగా 9984 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యం ఉంది. ఇందులో 4500 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలిన వాటిని ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్న లక్ష్యంగా చర్యలు చేపట్టాం. పూర్తి అయిన గృహ నిర్మాణాలకు రూ.8 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. వాటిని లబ్ధిదారులకు అందిస్తున్నాం. మిగిలిన గృహాలు 2026 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలాఖరుకు మాకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాము. ఎక్కడా బిల్లులు లబ్ధిదారులకు పెండింగ్‌లో లేవు. బహుశా ఈ నెలాఖరులో పూర్తి అయిన ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు ఉండవచ్చని భావిస్తున్నాం. ప్రభుత్వం సామూహిక గృహప్రవేశాలపై తగు నిర్ణయం తీసుకోవలసి ఉంది. కొత్తగా ప్రభుత్వం కేటాయించిన స్థలాలలో గ్రామీణ ప్రాంతాలలో అయితే మూడు సెంట్లు, అర్బన్ లో అయితే రెండు సెంట్ల స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టనున్నాం.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా ? గృహ నిర్మాణాల లబ్ధిదారులకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : జిల్లాలో సిబ్బంది కొరత కొంతమేర ఉన్నప్పటికీ ఎక్కడా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాము. సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి నివేదించాము. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చు.

జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ

రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

ఘనంగా ఎస్‌బిఐ దినోత్సవం

ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ బ్యాంకు దినోత్సవాన్ని ఆదివారం నగరంలోని సాయినగర్ రీజనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రీజియన్ మేనేజర్ రమేష్‌కుమార్, స్టేట్‌బ్యాంకు స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ భారద్వాజ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం దివంగత నేత కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, మిత్రులు చురుగ్గా పాల్గొని 90 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా భారద్వాజ మాట్లాడుతూ అన్ని దానాలకన్న రక్తదానం ఎంతో గొప్పదన్నారు. రక్తదానం ఎందరో ప్రాణాలను రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు వైఎన్ చంద్రశేఖర్, రఘురామ్‌యాదవ్, హెచ్‌ఆర్ మేనేజర్ కృష్ణ, ఉద్యోగులు రమేష్, హరీష్, సాయిగురు బాబా, శివప్రసాద్, గోవిందు, రామకృష్ణారెడ్డి, సాదిక్, సుధీర్, రామాంజి, శ్రీనివాసులు, భూపాల్‌రెడ్డి, కిరణ్, సుదర్శన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటికి మద్దతుగా క్రికెటర్ల ర్యాలీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెటర్లు

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)కి ఎఫ్‌సిఆర్ఎ రెన్యూవల్ చేయాలంటూ జిల్లా క్రికెటర్లు అనంతపురం నగరంలో కదం తొక్కారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆర్‌డిటీ అన్ని విధాలుగా క్రికెటర్లందరికి తోడుగా ఉంటూవస్తున్నారు. వారి సేవలు జిల్లాలో కొనసాగాలని డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షులు పగడాల మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్‌డిటి సేవ చేసిందని, ఇప్పుడు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్‌డిటికి అండగా నిలిచి జిల్లాలో ఆర్‌డిటి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ కేంద్రం వెంటనే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరించాలని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, భీమలింగారెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, షాబుద్దీన్, ప్రసాద్‌రెడ్డి, రంజీ క్రికెటర్లు సురేష్, సీనియర్ క్రికెటర్లు మాజీ సెక్రటరీ శ్రీనివాసులు, కమలాకర్‌నాయుడు, సీతారామారావు రవీంద్రనాథ్, చంద్రమోహన్‌రెడ్డి మాజీ రంజీ క్రికెటర్లు ఫయాజ్, షాషావలి, మురళి, సర్దార్, సాగర్, విజయ్ రాజు, దాదా ఖలందర్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తికోటను అభివృద్ధి చేయాలని వినతి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లాలోని గుత్తికోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజలకు రాజుల కాలం నాటి వైభవం అనుభవాలను పెంపొందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేష్‌ను ఎంపి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి తాను స్వయంగా గుత్తిని సందర్శించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీసాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత యాడికి పోలీస్ జట్టు

యాడికి : మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డు సాయిబాబా గుడి సమీపంలో నిర్వహించిన శ్రీసాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా యాడికి పోలీసు జట్టు నిలిచింది. ఆదివారం యాడికి పోలీస్ జట్టు, పెద్దపప్పూరు జట్టు ఫైనల్ పోటీలో తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యాడికి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పెద్దపప్పూరు జట్టు 93 పరుగులు చేసి ఓటమి పాలైంది. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, ఎస్ఐ వెంకట రమణయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, స్టాంపు రైటర్ జూటూరు రజాక్, జూటూరు బ్రదర్స్‌ఇస్మాయిల్, అమీర్‌బాషా, మహబూబ్ రబ్బాని, సర్దార్, ఫిరోజ్, సోయాబ్, నిర్వాహకులు దస్తగిరి జక్కా నాగరాజు, గురు, హరి, రవి, అరుణ్, పల్లా పురుషోత్తం, శ్రీను, అంజిబాబు పాల్గొన్నారు.

అర్ధరాత్రి 'విచిత్ర' చోరీలు

కేవలం కోళ్లే అపహరణ

యల్లనూరు : చోరీలు చేసే వారు ఎవరైనా డబ్బు, నగలు వంటివి చేస్తారు. అయితే మండలంలో ఇప్పుడు కొత్తరకం చోరీలు చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి వేళకోళ్లను ఎత్తుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మండల కేంద్రంలోని పాతపేట శివారులో చెట్లపై ఉన్న కోళ్లను కిందకు రప్పించి చోరీ చేశారు. తెల్లవారి చూశాక కోళ్లు కనిపించకపోవడంతో బాధిత యజమానులు అవాక్కయ్యారు. ఉదయం ఎక్కడ వెతికినా కోళ్ల కనిపించలేదు. నేడు కోళ్లు మాత్రమే చోరీ అయ్యాయి.. రేపటి నుంచి ఏం చోరీలు జరిగినా ఇంతే కదా అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చోరీలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రీసర్వే భూములపై ప్రత్యేక డ్రైవ్

యల్లనూరు : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన వారి రైతుల కోసం ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించనున్నట్లు తహశీల్దార్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న రైతుల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంతోపాటు వివిధ పథకాల లబ్ధి పొందలేక రైతులు ఇబ్బందులు పడుతున్న తెలిపారు. వారికోసం ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు నామమాత్రం దరఖాస్తు రుసుం రూ.50ను గ్రామ సచివాలయాల్లో చెల్లించి జాయింట్ పట్టా భూములను సబ్ డివిజన్ చేయించుకోవచ్చన్నారు. జూన్ 30వతేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని వివరించారు.

కౌలురైతు చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

నూతన కౌలు చట్టం అమలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు అన్నారు. ఆదివారం వజ్రకరూరు మండల పరిధిలోని కడమలకుంట గ్రామంలో కౌలు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులందరూ ఐకమత్యంతో కలిసికట్టుగా పోరాడి సమస్యలు పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. కౌలు రైతులందరికీ సీసీఆర్‌సి కార్డులు అందజేసి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ కింద కౌలు రైతులకు రూ.20వేలు ఇవ్వాలన్నారు. ముందస్తు గుత్తి చెల్లించి సాగు చేసి నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షులుగా సురేంద్ర, ఉపాధ్యక్షులుగా నాగప్ప, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కమిటీ సభ్యులుగా రామాంజనేయులు, పార్వతి, బజారు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. గుమ్మనూరు జయరామ్‌ను వెంకటరామిరెడ్డి ఏకవచనంతో బోధించడంపై ఆగ్రహించిన టిడిపి నాయకులు ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాటి ప్రజాప్రతినిధి అన్న గౌరవం లేకుండా ఏకవచనంతో ఎమ్మెల్యేను దూషించడం బాధాకమరన్నారు. వెంకటరామిరెడ్డి గత ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు చేసిందేమీ లేదన్నారు. కేవలం అగ్రకుల వర్గాలు, ఆయనకు భజన చేసే కార్యకర్తలను మాత్రమే ఆదరించారని ఆరోపించారు. అన్నివర్గాల ఆదరణతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే జయరామ్‌ను అవమానించడం హేయమైన చర్య అన్నారు. వెంటనే ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిప్పగిరి గోవిందు, గుణశేఖర్, ఎస్సీ సెల్ నాయకు జింకల జగన్నాథ్, చికెన్ జగన్, రవి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, కృష్ణారెడ్డి, పాతకొత్త చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో ఛైర్మన్ పదవి రేసులో ప్రతాప్‌చౌదరి

ప్రజాశక్తి-నార్పల

వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్ విండో) ఛైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకులు ప్రతాప్‌చౌదరి పేరును టిడిపి అధిష్టానం ఖరారు చేసినట్లు మండల వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. టిడిపి ఆవిర్భవించినప్పటి నుంచి మండలంలో పార్టీ మారని కుటుంబాల్లో ప్రతాప్‌చౌదరి కుటుంబం ఒకటి. 1983 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు పార్టీ అభ్యర్థితో సంబంధం లేకుండా అధిష్టానం ఏ అభ్యర్థిని నిర్ణయిస్తే ఆ అభ్యర్థి విజయానికి చిత్తశుద్ధితో పని చేసిన చరిత్ర ప్రతాప్‌చౌదరి కుటుంబానికి ఉంది. గతంలోనే ప్రతాప్‌చౌదరికి మండల కన్వీనర్ పదవి వచ్చినట్లే వచ్చి చేజారిపోయింది. ప్రస్తుతం ప్రతాప్‌చౌదరి కుటుంబ సేవలను గుర్తించి టిడిపి అధిష్టానం ఈసారి కచ్చితంగా సింగిల్‌విండో ఛైర్మన్ ఇచ్చే అవకాశం ఉందని టిడిపి కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యా వ్యవస్థలో ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని గిరిజన ఐక్య సాధన సమితి వ్యవస్థాపకులు మూడ్ కేశవనాయక్ ఆదివారం ఒక ప్రకనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం, ఎల్‌కెజి నుంచి పీజీ వరకూ, ఇంజనీరింగ్, అన్ని కళాశాలలో 50 శాతం సబ్సిడీతో విద్య అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలు పాటించని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫామ్, నోట్‌బుక్స్, రికార్డులు పేరుతో సాగుతున్న విద్యా వ్యాపారాన్ని నిరోధించాలన్నారు. టెక్నో, ఈ టెక్నో, కామన్ విద్య పేరుతో లేనిపోని భ్రమలు కల్పించి విద్యార్థులకు తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు దండుకుంటున్నారన్నారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్చకుల మధ్య వాగ్వాదం

అర్చకత్వ బాధ్యతల మార్పుపై ఆగ్రహం

ప్రజాశక్తి-రాయదుర్గం

గొడవ పడుతున్న అర్చకులు

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో అర్చకత్వం బాధ్యతల బదిలీపై ఆదివారం ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఉప గర్భాలయానికి తాళాలు వేశారు. వైదిక సంప్రదాయం ప్రకారం శ్రీ వైష్ణవులే వెంకటరమణస్వామి ఆలయంలో అర్చకత్వం కొనసాగించాలని కోరుతూ గతం నుంచి తమ పూర్వీకులే ఆలయంలో అర్చక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, కావున తమనే కొనసాగించాలని వారి వారసులు మురళీ భట్టర్ కోరడంతో గత డిసెంబర్ నెలలో వెంకటరమణ స్వామి ఆలయ అర్చక బాధ్యతలు చేపట్టారు. అయితే 14 ఏళ్లుగా ఆలయంలో అర్చక బాధ్యతలు కొనసాగిస్తూ పూజాదికాలు సక్రమంగా నిర్వహించి కొనసాగిస్తున్న తమను అర్చక బాధ్యతలు నుండి ఎలా తొలగిస్తారని కోరుతూ నరసింహ శాస్త్రి దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఎలాంటి తీర్పు వెలువరించకపోగా తనను అర్చక బాధ్యతల నుంచి ఎలా తొలగించారని కోరుతూ నరసింహ శాస్త్రి హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో ఆయన్నే అర్చక బాధ్యతలు కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు దేవాదాయ శాఖ సమూహ ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి ఆదివారం అర్చక బాధ్యతలను మురళి భట్టర్ నుండి వెనక్కి తీసుకొని నరసింహ శాస్త్రికి అప్పగించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కార్యనిర్వహణాధికారి సూచన మేరకు తాను అర్చక బాధ్యతను నరసింహ శాస్త్రికి అప్పగించినట్లు మురళి భట్టర్ తెలిపారు. నరసింహ శాస్త్రి మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా ఆలయ హుండీ రూ.30వేల నుంచి రూ.5.50లక్షల వరకూ పెరిగేలా చేయడంతోపాటు ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వచ్చేలా వారికి మెచ్చేలా పూజలు చేసిన తననే అర్చకులుగా కొనసాగించాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాను బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. వెంకటరమణ స్వామి ఆలయ పూజ బాధ్యతలు శ్రీ వైష్ణవులకు చెందాలని మురళి భట్టర్ చెబుతున్నారు. ట్రిబ్యునల్ తుది తీర్పు మేరకు తాము వ్యవహరించుకుంటామని మురళి భట్టర్, నరసింహశాస్త్రి తెలిపారు. అయితే బాధ్యతలు ఒకరి నుండి మరొకరికి బదిలీ అయ్యాక అర్చకుల మధ్యలో వివాదం తలెత్తి అర్చకులు ఇరువర్గాలుగా విడిపోయి ఆలయ ప్రాంగణంలో వాగ్వివాదం చేసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు వారిని సర్ది చెప్పారు.

గుండిగానిపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా శివలింగప్ప

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

శివలింగప్పను సన్మానిస్తున్న మండల టీడీపీ నాయకులు

మండలంలోని గుండిగానిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా శివలింగప్ప ఎన్నుకున్నట్లు మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు యువ నాయకులు ధర్మతేజ సూచనల ప్రకారం గుండిగానిపల్లి గ్రామ టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర, ఉపాధ్యక్షులుగా కేపీ రాజప్ప, గ్రామ కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శులుగా సురేష్, గిరీష్, రాషుల్‌సాబ్, కార్యదర్శులుగా అజ్జన్న, వన్నూరు స్వామి, నాగభూషణం, వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి గ్రామంలోని టీడీపీ ముఖ్య నాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కురుగోడ, జెడ్పీటీసీ ప్రభావతమ్మ, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగిరెడ్డి, చంద్రన్న, ఐ టీడీపీ ఛాంపియన్ బొజ్జన్నగౌడ్, ఉద్దేష్, నాయీబ్రాహ్మణ కమిటీ అధ్యక్షులు నరసింహులు, వనజామల్లికార్జున, సర్పంచు అభ్యర్థి చంద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులందరికీ ఒకేవిధంగా ఎల్‌పిసి ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిఇఒతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించిన నేపథ్యంలో ఉపాధ్యాయులందరికి ఎల్‌పిసి ఒకే విధంగా ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి కోటేశ్వరప్ప, సీనియర్ నాయకులు నాగేంద్ర, చెన్నకేశవులు డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ నాయకులు డిఇఒ ఎం.ప్రసాద్ బాబును జిల్లా సైన్స్ సెంటర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు జరిగిన సందర్భంగా ఎల్‌పిసి విషయంలో వివిధ మండలాల ఎంఈఓలు వివిధ రకాలుగా శాలరీస్ విషయమై చెప్పడం జరుగుతోందన్నారు. స్పందించిన డిఇఒ ఉన్నతాధికారులను సంప్రదించి వారి నేతృత్వంలో ఎంఈఓలకు జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా ఎల్‌పిసి ఉండేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు.

24న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశానికి మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 24న పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

పుట్లూరు : మండలంలోని 12 మంది మహిళా సర్పంచులకు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు మండలంలోని ఎస్.గూడూరు, గాండ్లపాడు, ఎ.కొండాపురం, అరగటివేముల, సూరేపల్లి, దోసలేడు, చెర్లోపల్లి, మడ్డిపల్లి, కుమ్మనమల, మడుగుపల్లి, ఎల్లుట్ల, చాలివేముల పంచాయతీల మహిళా సర్పంచులు హాజరుకావాలని కోరారు.

పేదలకు అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శనగర్‌లోని ఆశ్రమం వద్ద పేదలు, చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు మాధవీలత, భర్త నాగరాజు కుమారుడు వెంకట్ దీపక్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కీర్తనశ్రీ, ధర్మ తేజ, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' పేదలకు వరం

శింగనమల : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం పేదలకు వరమని తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిజం చేస్తూ సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోని తల్లుల ఖాతాలకు ఒక్కొక్క విద్యార్థికి రూ.13వేల చొప్పున నగదు జమ చేశారన్నారు. దీంతో తల్లుల మోహాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. గత వైసిపి పాలనలో అమ్మఒడి ఒక్కరికి మాత్రమే అమలు చేశారన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు.

టిడిపి అనంతపురం రూరల్ మండలాధ్యక్షులుగా సూర్యనారాయణ

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులుగా జింకా సూర్యనారాయణ రెండోసారి ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా షేక్షావలి నాయుడు నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ మండల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

కణేకల్లు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001లో చదుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇందులో భాగంగా ఎక్కడెక్కడో స్థిరపడిన ఆనాటి విద్యార్థులందరూ ఒకచోట చేరి అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులు హబీబ్, చిక్కన్న, శివ, హనుమంతురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గుర్రప్ప, రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్ గౌస్‌పీర్, వీరేష్, ఇర్ఫాన్, జిలాన్, బాలు, నాగు, అనిల్, శివ, సునీల్, త్రిలోక్, సతీష్, శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కళ్యాణదుర్గం టౌన్ : అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం చేపట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. హెల్పర్లు మాత్రం సెంటర్‌లో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్కర్స్, హెల్పర్లకు వర్తింపజేయాలని, పలురకాల యాప్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా మార్చాలని కోరారు.

బదిలీ డిఐపిఆర్‌ఒకి సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం ఐఅండ్‌పీఆర్ డిఐపిఆర్‌ఓగా పనిచేస్తూ తిరుపతికి సాధారణ బదిలీపై వెళ్లిన డిఐపిఆర్ఒ పి.గురుస్వామిశెట్టి దంపతులకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను ఆదివారం వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో డిఐపిఆర్‌ఓ, శ్రీమతి రేణుక దంపతులకు మెమెంటోలను అందజేసి వివేకానంద యోగ కేంద్రం గురువు ఆంజనేయులు, అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, గురువు డాక్టర్ శ్రీనివాస్, దివాకర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు ఘనంగా సన్మానించారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు జిల్లా రజక ఉద్యోగులు విద్యా వంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం ఎన్జీఓ హోంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాలు కార్యక్రమానికి జిల్లా రజక ఉద్యోగులు విద్యా వంతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎక్కలూరు రంగనాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా బెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండి చంద్రశేఖర్, సురేష్, జిల్లా ఉద్యోగ విద్యా వంతుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పి. కమ్మన్న, ప్రధాన కార్యదర్శి దోగురు శ్రీ హరి హాజరై 19 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక అభివద్ధి సంస్థ ఛైర్మన్ ఎన్‌సి. నారాయణస్వామి, కష్ణమూర్తి, డాక్టర్ ముత్యాలు, రామలింగయ్య, సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'యువతపోరు'కు తరలిరండి

ప్రజాశక్తి-రాయదుర్గం

పోస్టర్ల విడుదలలో వైసిపి నాయకులు

రాయదుర్గంలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి సాధనకు ఈనెల 23వతేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మారన్న, జిల్లా ట్రెజరర్ నాగిరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కణేకల్, హీరేహాల్, రాయదుర్గం రూరల్ మండల కన్వీనర్లు గుడిసెల రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, బసవరాజు, మారన్న, బిటిపి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ సమస్యల సాధన కోసం ఈనెల 23వతేదీన వైసిపి ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న 'యువత పోరు'ను విజయవంతం చేయవాలని వైసీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తం పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీల అమలు చేయకుండా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేనిపక్షంలో నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నామని హామీ ఇచ్చారన్నారు. ఏటా జనవరి 1వ తేదీనే జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయన్నారు. ఏడాది గడిచినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఒక్కరికీ నిరుద్యోగ భృతి అందకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా పీకేస్తున్నారని మండిపడ్డారు. మాజీ సిఎం జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 1.25 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లను తొలగించి యువతను నిరుద్యోగులుగా మార్చారన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే యువతపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరులో జిల్లావ్యాప్తంగా ఉన్న యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు మంజునాథరెడ్డి, ఉరవకొండ మండల నాయకులు షేక్ ఇర్ఫాన్, హరికృష్ణ, బాబా షరీఫ్, ఇంద్రకర్, తదితరులు పాల్గొన్నారు.

అర్చకునిపై ఇఒ దూషణ

సోషల్ మీడియాలో ఆడియో హల్‌చల్

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చింతకుంట శ్రీ కాలభైరవ స్వామి అర్చకులు సూర్యప్రకాష్‌మూర్తిపై దేవాదాయ శాఖ ఇఒ మురళీకృష్ణ అసభ్యపదజాలంతో దూషించిన ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సూర్యప్రకాష్‌మూర్తి భైరవ స్వామి భూమి మన్యం కోసం ఆర్‌డిఒ కేశవనాయుడును కలిసి సమస్యను విన్నవించారు. ఇందుకు స్పందించిన ఆర్‌డిఒ దేవాదాయ శాఖ ఇఒ మురళీకృష్ణను మందలించారు. దీంతో ఆగ్రహించిన ఇఒ అర్చకులు సూర్యప్రకాష్‌మూర్తిని ఫోన్‌లో దూషించారు. ఆడియోలో ఆర్‌ఒను కూడా విచ్చలవిడిగా దూషించడం గమనార్హం.

ఉపాధ్యాయులకు ఎల్‌పిసి ఒకే విధంగా ఇవ్వాలి

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు ఖాళీలను చూపించాలి

డిఇఒకు ఎపిటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మినిమం టైం స్కేల్‌తో పనిచేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులకు సుదూర ప్రాంతాల్లో జిల్లాలోని బార్డర్ పాఠశాలలలోని ఖాళీలను మాత్రమే చూపించడం అన్యాయమని వారికి న్యాయం చేస్తూ అన్ని మండలాలలో ఏకోపాధ్య పాఠశాలలుగా ఉన్న ప్రతి పాఠశాలలోనూ ఖాళీలుగా చూపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏపిటిఎఫ్ నాయకులు డిఇఓ ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక ఏకోపాధ్యా ఉపాధ్యాయులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు ఎంటిఎస్ ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. దాదాపు 300 పైగా ఖాళీలు ఉన్న మున్సిపల్ పాఠశాలలకు ఎంపీ ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులు లేని ప్రాథమికోన్నత పాఠశాలలకు కూడా ఎంటిఎస్ ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు.